
సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 3 । జనవరి । 2023



అరుణాచల్ ప్రదేశ్‌పై ఆంధ్రా ఘన విజయం

కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్రాల అండర్-25 క్రికెట్ మ్యాచ్‌లో అరుణాచల్‌ప్రదేశ్ జట్టుపై ఆంధ్రా జట్టు ఘనవిజయం సాధించింది. - 8లో



విహారం.. విషాదం

విహార యాత్ర ముగించుకుని బైకుపై ఇంటికి తిరిగి వస్తుండగా కుక్కను ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.9/19.0

జిల్లాలో సోమవారం 19.0 - 31.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి జిమ్నాస్టిక్స్, బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ఈనెల 3వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి జిమ్నాస్టిక్స్ ఎంపికలు, కడప డీఎస్ఏ క్రీడామైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సెట్ప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి.అమృత్‌రాజ్ తెలిపారు. 18 సంవత్సరాలలోపు వయసు కలిగినవారు ఎంపికలకు అర్హులన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించి పాల్గొనాలని సూచించారు. జిమ్నాస్టిక్స్ జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు జనవరి 8,9 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ శాప్‌లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు కాకినాడలో ఈనెల 5,6 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ శాప్‌లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

రేపు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ శాప్‌లీగ్..

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఈనెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి శాప్‌లీగ్ ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సెట్ప్ సీఈఓ సి.సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ తెలిపారు. జిల్లాలోని 14 సంవత్సరాల పైబడిన వయసు గల క్రీడాకారులు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 27న నంద్యాల జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

90.27 శాతం పింఛన్ల పంపిణీ



ప్రొద్దుటూరులో వృద్ధాప్య పింఛన్ ఇస్తున్న వలంటీర్

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ ప్రక్రియ జోరుగా సాగుతోంది. రెండవ రోజైన సోమవారం 90.27 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. మొత్తం 2,56,193 పింఛన్లకుగాను రూ.70,70,79,500లను పంపిణీ చేయాలి. అందులో భాగంగా సోమవారం సాయంత్రం 5.10 గంటల సమయానికి 2,35,358 మంది పింఛన్లకు రూ. 63,82,60,750ను పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఇంటి వద్దకే పింఛన్ నగదు రావడం పట్ల అవ్వాతాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వైకుంఠవాసా.. శ్రీ వేంకటేశా!



దేవునికడపలో వైకుంఠ ద్వారంలో భక్తులకు అభయమిస్తున్న కడప రాయుడు, వైకుంఠ ద్వార దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

- ఘనంగా ముక్కోటి ఏకాదశి
- కిక్కిరిసిన వైష్ణవాలయాలు
- ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న భక్తులు
- మార్మోగిన గోవింద నామ స్మరణ
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం
- పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కడప కల్చరల్: గోవిందనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని సోమవారం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చలిని సైతం లెక్క చేయకుండా వేకువజామునుంచే ఆలయాల వద్ద ఉత్తరద్వార దర్శనానికి భక్తులు బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు.

ప్రభుత్వ గుర్తింపుగల ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్తర గోపురాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి అటువైపునుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో కూడా అన్నమయ్య జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారి వైకుంఠ ఏకాదశి రావడంతో ఆలయ నిర్వాహకులైన టీటీడీ అధికారులతోపాటు మేడా కుటుంబ సభ్యులు కూడా ప్రత్యేక శ్రద్ధతో ఉత్తర గోపురం వద్ద వైకుంఠ ద్వారాన్ని కనుల పండువగా అలంకరించి భక్తులను దర్శనాలకు అనుమతించారు. జమ్మలమడుగు శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా భక్తజనం వైకుంఠ ద్వారం నుంచి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రొద్దుటూరు రామేశ్వరం ఆలయం, పుష్పగిరి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో కూడా విశేష పూజలు, వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకున్నారు.



ఒంటిమిట్ట:ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిస్తున్న సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట ఆలయాన్ని దర్శించుకున్న ప్రముఖులు



రామయ్య సన్నిధిలో కుటుంబ సమేతంగా జిల్లా కలెక్టర్

రెండవ అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, కుటుంబ సభ్యులు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి దర్శనం చేసుకున్నారు.

తిరుమల తొలి గడపలో..

జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయం తిరుమల తొలిగడప దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచి దర్శనానికి అనుమతించినా తెల్లవారుజాము 3 గంటల నుంచే భక్తులు వైకుంఠ ద్వారం వద్ద దర్శనం కోసం వేచి ఉన్నారు. స్వామి ఆలయం నుంచి పాతకడప రోడ్డులోని శివాలయం వరకు భక్తులు ఆరు వరుసల క్యూలో వేచి ఉండి మరీ దర్శనం చేసుకున్నారు.



శేషశయన వాహనంపై దర్శనం ఇస్తున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి

ఆలయంలో మూలమూర్తిని దర్శించేందుకు కూడా భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరి వేచి ఉన్నారు. వికలాంగులను నేరుగా వైకుంఠ ద్వారం వద్దకు అనుమతించి సులభంగా దర్శనం కల్పించారు.

శేషశయన వాహనంపై శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి శ్రీలక్ష్మీసమేత శ్రీవిష్ణుమూర్తి అవతారంలో దర్శనం ఇచ్చారు. స్వామి వారు శేషశయన వాహనంపై ఆశీనులయ్యారు. స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు, రేపు అంధ ఉద్యోగులకు ఆన్ డ్యూటీ

కడప కల్చరల్ : అంధుల లిపి నిర్మాత లూయిబ్రెయిలీ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అంధులైన ఉద్యోగులకు ఈనెల 3, 4 తేదీలను ఆన్‌డ్యూటీలుగా పరిగణించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీన బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా 3, 4 తేదీలలో జిల్లాలోని అంధులైన ఉద్యోగులను ప్రోత్సహిస్తూ నేషనల్ ఫెడరేషన్ బ్లైండ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 3వ తేదీ ఉదయం 9.30 గంటలకు మున్సిపల్ స్టేడియంలో అంధులకు జిల్లా స్థాయిలో క్రీడలు, ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న సాయంత్రం 4.00 గంటలకు ప్రభుత్వ అంధుల పాఠశాలలో జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. అంధులైన ఉద్యోగులు ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వీలుగా ఆయా శాఖల అధికారులు వారిని ఈ తేదీలలో ఆన్‌డ్యూటీగా పరిగణించాలని ఆయన సూచించారు.

దస్తావేజుల రిజిస్ట్రేషన్‌పై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేస్తే కలిగే లాభాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల రిజిస్ట్రేషన్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.శివరాం తెలిపారు. సోమవారం కడప అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు, స్థలాల క్రయవిక్రయదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూముల క్రయవిక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ చేసే విషయంగా సూచనలు పాటించాలన్నారు. జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి, ఆడిట్ ఎస్ఎండీ రఫీ, జాయింట్-1,2 సబ్ రిజిస్ట్రార్లు వెంకటేశ్వర్లు, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శివరాం

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలతోకలిసి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల పురోగతి, ప్రాధాన్యత, భవన నిర్మాణాల అభివృద్ధి పనులు తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై మండల, నియోజకవర్గ స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణాలలో మరింత వేగం పెంచాలన్నారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు, హౌసింగ్, అనుబంధ శాఖల అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

గండికోట రోప్‌వేను త్వరితగతిన పూర్తి చేయాలి

గండికోట రోప్‌వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. సోమవారం జిల్లా పర్యాటక మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయడానికి జిల్లా పర్యాటక మండలి నిర్ణయించిందన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన పార్నపల్లె బోటింగ్, రెస్టారెంట్ సేవలను త్వరిత గతిన అందుబాటులోకి తీసుకు రావడానికి కృషి చేయాలన్నారు. అలాగే బ్రహ్మంసాగర్‌లో బోటింగ్ సేవలు ప్రారంభించాలన్నారు. ప్రొద్దుటూరు, పులివెందులలో నగర వనాలను అభివృద్ధి చేయాలని డీఎఫ్‌ఓలను ఆదేశించారు. జిల్లా పర్యాటక మండలిలో (మన కడప) బస్సు విహారయాత్రను మార్చి వరకు పొడిగించాలని అధికారులకు సూచించారు. డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, సంబంధిత ఆర్డీఓలు, టూరిజం ఆర్డీ రామచంద్రయ్య, జిల్లా పర్యాటక శాఖాధికారి మల్లికార్జున, పర్యాటక ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఈశ్వరయ్య, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తోపాటు డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, పెద్దిరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామమోహన్, నరసింహులు, చంద్రమోహన్‌లు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినతులను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువులోపు పరిష్కరించాలన్నారు.

మహిళల జీవితాల్లో వెలుగు దివ్వెలు

- వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ పథకాలతో మెరుగుపడిన జీవనోపాధి
- దినదినాభివృద్ధి చెందుతున్న వ్యాపారాలు

కడప కార్పొరేషన్/రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు స్వయం సహాయక సంఘాల మహిళల జీవితాల్లో వెలుగు దివ్వెలుగా మారాయి. ముఖ్యంగా 2019 నాటికి ఎస్‌హెచ్‌జీ సంఘాలకు ఉన్న బకాయిలను రద్దు పరిచే వైఎస్సార్ ఆసరా, 45 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఇచ్చే వైఎస్సార్ చేయూత, ఎస్‌హెచ్‌జీ సంఘాలు తమ రుణాలను సక్రమంగా చెల్లిస్తే ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీ 'సున్నావడ్డీ' పథకాలు వారికి ఆసరాగా నిలిచాయి. వైఎస్సార్ ఆసరా ద్వారా జిల్లాలోని సుమారు 21040 గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు రెండు విడతలుగా రూ.346.31కోట్లు, పట్టణాల్లోని సుమారు 9438 సంఘాలకు రూ.668కోట్లు రుణమాఫీ అయింది. వైఎస్సార్ సున్నావడ్డీ పథకం ద్వారా 26,816 గ్రామీణ సంఘాలకు మూడు విడతలుగా రూ. 161.78కోట్లు, 11,135 పట్టణ సంఘాలకు రూ.54.31కోట్లు లబ్ధి చేకూరింది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 83,068 మంది 45 ఏళ్లు నిండిన మహిళలకు రూ.18750 చొప్పున మూడు విడతల్లో రూ.765.01 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 26593 మంది మహిళలకు రూ.149.59కోట్ల నిధులను వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకాల ద్వారా వచ్చే నగదును పెట్టుబడిగా పెట్టి తమ వ్యాపారాలను దినదినాభివృద్ధి చేసుకుంటున్నారు.

ఎంచక్కా.. శారీ బిజినెస్



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు షేక్ మల్లిక. అక్కాయపల్లెలో హబీబా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. మొదట తన భర్తతో కలిసి టైలరింగ్ షాపు నిర్వహించేవారు. ఇటీవలే ఈ సంఘానికి బ్యాంకు నుంచి రూ.13లక్షల రుణం రావడంతో ఆ డబ్బుతో చీరెల వ్యాపారం ప్రారంభించారు. ఈ సంఘానికి వైఎస్సార్ ఆసరా కూడా వస్తోంది. ప్రతి సభ్యురాలికి రూ.40వేల చొప్పున రుణమాఫీ అవుతోంది. వీరికి ముగ్గురు పిల్లలు కాగా ఒకరు బీటెక్, ఒకరు ఇంటర్, మరొకరు 5వ తరగతి చదువుతున్నారు. ఇద్దరు పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి పథకాలు అందుతున్నాయి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని టైలరింగ్ షాపు, శారీ బిజినెస్ ద్వారా నెలకు రూ.30వేల వరకూ సంపాదిస్తున్నారు.



టైలరింగ్ షాపులో నిమగ్నమైన షేక్ మల్లిక

చిరుధ్యానాలతో చింతలేని వ్యాపారం

శ్రీస్వగృహ ఫుడ్స్ ద్వారా చిరు ధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేస్తూ శ్రీలలిత గ్రూప్ సభ్యులు కె. ఇందిర, పి. మౌనిక ఆదర్శంగా నిలుస్తున్నారు. చిరు ధాన్యాలను ఉపయోగించి చక్కెర, బెల్లంతో బిస్కెట్లు, పప్పుబిల్లలు, డ్రైఫ్రూట్స్, సున్నుండలు, పల్లీ డ్రైఫ్రూట్స్, కరివేపాకు, మునగాకుతో మురుగులు, నువ్వులతో లడ్డు, కొర్రలు, రాగులు, జొన్నలతో పేలాలు, లడ్లు, బిస్కెట్లు, చెక్కిలాలు, కారాలు తయారు చేస్తూ తమ ప్రత్యేకతను చాటుతున్నారు. నగరంలోని ఐటీఐ సమీపంలో మొదటగా చిన్నగా వ్యాపారం ప్రారంభించిన వీరి గ్రూప్‌నకు ఇటీవలే రూ.15లక్షల రుణం లభించింది. వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ పథకాలు కూడా వర్తించాయి. ఇంకేముంది చిన్నగా రూ.2లక్షల విలువ జేసే యంత్రాలను కొని తమ పనిని మరింత సరళతరం చేసుకున్నారు. తాము తయారు చేసిన ఆహార పదార్థాలను వారు ప్యాకెట్లుగా తయారు చేసి, లేబుల్ వేసి సూపర్‌మార్కెట్లు, కిరాణా షాపులకు హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు.



చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీలో ఇందిర, మౌనిక

వైఎస్సార్ ఆసరా	గ్రామీణ	రూ.కోట్లలో	పట్టణ	రూ.కోట్లలో
మొదటి విడత	20984	171.85	9385	331
రెండో విడత	21058	174.43	9491	337
సున్నా వడ్డీ				
మొదటి విడత	22228	56.51	10750	20.46
రెండో విడత	25163	48.27	11308	16.59
మూడో విడత	33059	57.00	11347	17.26
వైఎస్సార్ చేయూత				
మొదటి విడత	77550	145.42	24819	46.55
రెండో విడత	81286	152.41	26517	49.71
మూడో విడత	90869	467.27	28445	53.33

'సూపర్బ్' మార్కెట్



సూపర్ మార్కెట్‌లో రమణమ్మ

సుమారు 20 ఏళ్ల నుంచి మహాలక్ష్మి స్వయం సహాయక సంఘ సభ్యురాలిగా ఉన్న రమణమ్మ మరియాపురంలో వన్నెం సూపర్‌మార్కెట్‌ను విస్తరించి వ్యాపారంలో రాణిస్తున్నారు. వీరి సంఘానికి ఈ మధ్యనే రూ.10లక్షల రుణం వచ్చింది. వైఎస్సార్ ఆసరా కింద రూ.6.20 లక్షలు వస్తోంది. సున్నావడ్డీ కూడా వర్తిస్తోంది. ఫలితంగా రెండేళ్ల క్రితం ఈమె మరియాపురం బిల్టప్‌కు పోయే మార్గంలో సూపర్‌మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. నిత్యావసరాలు, గృహావసరాలకు సంబంధించిన అన్ని వస్తువులను అందులో ఉంచి, నాణ్యమైన వస్తువులను హోల్‌సేల్ ధరలకే ఇస్తుండటంతో వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. తన భర్త, కుమార్తెతో కలిసి సూపర్ మార్కెట్‌ను ముందుకు తీసుకుపోతోంది రమణమ్మ.

వైఎస్సార్ చేయూత ద్వారా చేపట్టిన జీవనోపాధులు

వ్యాపారం	యూనిట్లు
రిటైల్ రంగం	4456
టెక్స్‌టైల్ వ్యాపారం	1977
డైరీ రంగం	5000
గొర్రెలు, మేకలు పెంపకం	3000
మాంసం కొరకు	500
గొర్రెపిల్లల పెంపకం	
నాటుకోళ్ల పెంపకం	1500
ఆహార ఉత్పత్తులు	471
వ్యవసాయ ఉత్పత్తులు	6921
ఇతర జీవనోపాధులు	5184
మొత్తం యూనిట్లు	39267

నవరత్నాల్లో అధిక భాగం మహిళలకే

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల్లో పథకాలన్నీ అధిక భాగం మహిళలకే కేటాయించాము. ముఖ్యంగా వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నావడ్డీ పథకాలు మహిళల ఆర్థిక పురోభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. ప్రభుత్వం కూడా మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందం చేసుకుని తక్కువ ధరకే వస్తువులు అందించడం వల్ల మహిళలు ఎక్కువ ఆదాయం పొందేందుకు ఆస్కారం ఏర్పడుతోంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను కూడా సక్రమంగా చెల్లిస్తున్నారు.

- ఎస్. రామమోహన్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ

ఆర్టీసీలో ఆఫర్లు

- నలుగురు ఒకేసారి టిక్కెట్ తీసుకుంటే ఐదు శాతం రాయితీ
- వయో వృద్ధులకు 25 శాతం
- ఈ-వ్యాలెట్ ద్వారా బుక్‌చేసుకుంటే ఐదు శాతం
- ముందస్తు తిరుగుప్రయాణంపై తగ్గింపు
- ప్రయాణికులను ఆకర్శించేందుకు ఆర్టీసీ యత్నాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రజా రవాణా సంస్థ ప్రయాణికులను ఆకర్శించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం వివిధ రకాల ఆఫర్లను ప్రకటించింది. ప్రయాణికులు ప్రైవేటు ఆపరేటర్ల వైపు వెళ్లకుండా అనేక చర్యలు చేపడుతోంది. మరోవైపు ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) మెరుగు పరుచుకునేందుకు పాటుపడుతోంది. అలాగే సీనియర్ సిటిజన్ల (వయో వృద్ధులు)కు టిక్కెట్‌లో 25 శాతం రాయితీ కల్పిస్తోంది. దీంతోపాటు ఇప్పుడు మరికొన్ని రాయితీలను కల్పించింది. నలుగురు ప్రయాణికులు (పిల్లలతోసహా) ఒకేసారి టిక్కెట్ తీసుకుంటే ఛార్జి మొత్తంలో 5 శాతం రాయితీ కల్పించింది. ఇది కుటుంబాలతో కలిసి ప్రయాణం చేసే వారికి లాభదాయకంగా ఉంటుంది. మరోవైపు ఈ-వ్యాలెట్ ద్వారా టిక్కెట్‌ను బుక్ చేసుకుంటే ఛార్జిలో ఐదుశాతం సొమ్ము తగ్గించే వెసులుబాటు కల్పించింది. ప్రయాణికులు రానుపోను టిక్కెట్‌ను ముందుగా రిజర్వు చేసుకుంటే తిరుగు ప్రయాణ ఛార్జిలో పది శాతం తగ్గిస్తోంది. ఈ సదుపాయాన్ని సంక్రాంతి, దసరా వంటి పండుగల సీజన్లలో నడిపే ప్రత్యేక సర్వీసులకు వర్తింపజేస్తోంది. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. దీంతో ప్రయాణికులకు, ఆర్టీసీకి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఆర్టీసీ అధికారులు ఇప్పటికే రానున్న సంక్రాంతికి కడప జోన్‌లోని కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి 400-450 ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ఈ బస్సుల్లో రెగ్యులర్ ఛార్జీలే తప్ప మునుపటిలా టిక్కెట్‌పై 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయబోమని ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఆర్టీసీ అందిస్తున్న రాయితీ సదుపాయాలను వినియోగించుకోవాలని కడప జోన్ ఈడీ గోపీనాథ్‌రెడ్డి కోరారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల వద్ద అనుమానాస్పద స్థితిలో దివ్య (25) అనే మహిళ మృతి చెందింది. సీకేదిన్నె ఎస్‌ఐ బి.అరుణ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోడ్డు కృష్ణాపురంలోని శివ సంధ్య నగర్‌కు చెందిన లోకాంజనేయులు దివ్యకు నాలుగు సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరి మధ్య గతంలో మనస్పర్థలు రావడంతో విడిపోయారు. ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసి ఇద్దరినీ కలపడం జరిగింది. తన భార్యతో కలిసి కడప నగరానికి వెళ్లి తన ఇంటికి తీసుకొని వస్తుండగా మార్గంమధ్యలో బైక్‌పై నుంచి పడి మృతి చెందినట్లు లోకాంజనేయులు తెలిపారు. తన కుమార్తెను తన అల్లుడే చంపినట్లు మృతిరాలి తల్లి లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

రామసముద్రం : కుదురుచీమనపల్లె గ్రామంలో ఒక మహిళ మెడలో గుర్తు తెలియని దుండగులు బంగారు గొలుసు లాక్కొని పారిపోయిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుదురుచీమనపల్లె గ్రామంలో ఓబుల్‌రెడ్డి చిల్లర దుకాణం ఉంది. దుకాణంలో అతని భార్య నిర్మల వ్యాపారం చేస్తుండగా.. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి టీ ఇవ్వాలని అడిగారు. ఆమె టీ ఇచ్చేందుకు ఫ్లాస్క్ దగ్గరకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కున్నాడు. అప్పటికే ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తితో కలిసి ఇద్దరు అక్కడి నుంచి పారిపోయారు.

అరుణాచల్‌ప్రదేశ్‌పై ఆంధ్రా ఘన విజయం

- అండర్–25 క్రికెట్ మ్యాచ్‌లో రెండో రోజే దక్కిన విజయం
- ద్విశతకంతో నాటౌట్‌గా నిలిచిన ఆంధ్రా బ్యాట్స్‌మన్ మహీప్



తలపడుతున్న ఆంధ్ర–అరుణాచల్‌ప్రదేశ్ జట్లు

కడప స్పోర్ట్స్ : కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్రాల అండర్–25 క్రికెట్ మ్యాచ్‌లో అరుణాచల్‌ప్రదేశ్ జట్టుపై ఆంధ్రా జట్టు ఘనవిజయం సాధించింది. 264 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు సోమవారం బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు 369 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని మహీప్‌కుమార్ 251 బంతుల్లో 24 ఫోర్లు, 5 సిక్సర్‌లతో 200 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ద్విశతకం నమోదు చేశాడు. ఈయనకు జతగా టి.వంశీకృష్ణ 212 బంతుల్లో 21 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 157 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వీరిద్దరూ కలిసి 359 పరుగుల భారీ భాగస్వామ్యం సాధించడం విశేషం. దీంతో కేవలం 1 వికెట్ నష్టానికి ఆంధ్రా జట్టు 369 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్‌ప్రదేశ్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి అరుణాచల్‌ప్రదేశ్ జట్టు 72 ఓవర్లలో 218 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నబమ్ జోష్ 66 పరుగులు, లిచా జాన్ 43 పరుగులు, దాడో టచుంగ్ 33 పరుగులు చేశాడు. ఆంధ్రా బౌలర్లు మహీప్‌కుమార్ 4 వికెట్లు, ఎం.ఆంజనేయులు 3 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో అరుణాచల్‌ప్రదేశ్ జట్టు 40 పరుగులకే ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో ఆంధ్రా జట్టు 111 పరుగుల ఆధిక్యంతో ఘన విజయం సాధించింది. దీంతో ఇన్నింగ్స్ ఆధిక్యంతో విజయం సాధించిన ఆంధ్రా జట్టుకు 7 పాయింట్లు లభించాయి.



డబుల్ సెంచరీ, 4 వికెట్లు తీసిన ఆంధ్రా ఆల్‌రౌండర్ మహీప్‌కుమార్



157 పరుగులు చేసిన ఆంధ్రా బ్యాట్స్‌మన్ వంశీకృష్ణ

బాబూ నీ పాదం మా ఊరిలో మోపొద్దు

- అమాయకుల ప్రాణాలను హరిస్తున్న చంద్రబాబుపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రొద్దుటూరులో పాదం మోపవద్దని తాను కోరుకుంటున్నానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన అడుగు పెడితే వినాశనమే జరుగుతుందన్నారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ రాజమండ్రి పుష్కరాల్లో 29 మంది ప్రాణాలు పోవడానికి చంద్రబాబే కారణమని తెలిపారు. గత వారంలో కందుకూరులో జరిగిన సభలో 8 మంది ప్రాణాలను బలిగొన్న చంద్రబాబు, వారం తిరగక ముందే గుంటూరులో మరో ముగ్గురి ప్రాణాలను తీసుకున్నారన్నారు. లేని జనాలను ఉన్నట్లు చూపించి ప్రజాకర్షణ కలిగిన నేతగా ప్రజల ఆదరాభిమానాలను పొందాలని ఆయన కోరుకుంటున్నారన్నారు. ప్రపంచమంతా నూతన సంవత్సర వేడుకలను జరుపుకొంటుంటే రాష్ట్రంలో నూతన పింఛన్ల పంపిణీ సంబరాలు ఓ వైపు జరుగుతుంటే మరో వైపు ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఇందుకు చంద్రబాబే పూర్తి బాధ్యత వహించాలని కోరారు. వ్యూహం ఉంటే సరిపోదని, సభలను జరిపేందుకు వ్యూహం ఉండాలన్నారు. డ్రోన్ కెమెరాలతో లేని జనాలను ఉన్నట్లు చూపించేందుకు బాబు తాపత్రయపడుతున్నారన్నారు. కానుకల కోసం వెళ్లిన పేదలను విమర్శించకూడదని, పేదరికం తప్పు కాదన్నారు. సభ జరిపిన విధానమే సరిగా లేదన్నారు. 3 వేలమందికి కానుకలు ఇచ్చి, 30 వేల మందిని పిలిచారన్నారు. మృత్యు సంఘటనను సైతం టీవీ ఛానళ్లలో చూడలేని పరిస్థితి నెలకొందన్నారు. 75 ఏళ్ల వయసు వచ్చిన చంద్రబాబుకు పదవి వ్యామోహం తగ్గలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చంద్రబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆయన సభలను కట్టడి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అంతర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక



అంతర్‌యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నెహ్రూ రోడ్డులోని వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు త్వరలో జరగనున్న అంతర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల యోగివేమన యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ కళాశాలల ఖోఖో మహిళల పోటీల్లో కళాశాల విద్యార్థినులు శిరీష, నాగనవీన, హరిచందన, ధనలక్ష్మి, తస్లీమ్, అమృత వర్షిణి, కరిష్మాలు ప్రతిభ కనపరచారు. ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు, రూ.5 వేల నగదు బహుమతి అందుకున్నారు. వీరిలో శిరీష, నాగనవీన, హరిచందన, ధనలక్ష్మి త్వరలో జరుగనున్న అంతర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ లింగారెడ్డి నాగేశ్వర రెడ్డి, అధ్యక్షుడు సుదర్శనరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామలక్ష్మిరెడ్డి, నాగరాజ, అధ్యాపకులు అభినందించారు.

కిడ్నాప్ కేసులో వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లె : కిడ్నాప్ కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఫాతిమా తెలిపారు. ఎస్‌ఐ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంగంవారిపల్లె పంచాయతీ కొండసానివారిపల్లెకు చెందిన మైనర్ బాలిక (15) గత నెల 23 నుంచి కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి తర్వాత కిడ్నాప్ కేసుగా మార్చారు. ఈ కేసులో నిందితుడైన నిమ్మనపల్లె పంచాయతీ గూడుపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు గెరివి వెంకటేష్ (23)ను చల్లావారిపల్లె క్రాస్ వద్ద సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం తరలించారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

కాపాడే ప్రయత్నంలో మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన హర్షద్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన షేక్ హర్షద్ (20) అనే పాలిటెక్నిక్ విద్యార్థి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. అతనిని కాపాడే ప్రయత్నంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హర్షద్ ప్రొద్దుటూరులోని పాలిటెక్నిక్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. పై అంతస్తులో నిల్చున్న అతను ఆదివారం రాత్రి దుస్తులు ఆరబెట్టేందుకు ఇనుప పైపును అందివ్వాలని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న తన తల్లి దిల్‌షాద్‌ను అడిగాడు. ఇనుప పైపును కుమారుడికి అందించే క్రమంలో.. పక్కనే ఉన్న విద్యుత్ లైన్లకు పైపు తగిలి షాక్‌కు గురయ్యాడు. అతను గట్టిగా కేకలు వేయగా కాపాడే ప్రయత్నంలో తల్లితోపాటు మహీర్ అనే యువకుడికి గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో పడిపోయిన హర్షద్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కొద్ది సేపటి తర్వాత మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన దిల్‌షాద్, మహీర్‌లను మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. హర్షద్ తండ్రి మౌలాలి టింబర్ డిపోలో పని చేస్తున్నాడు. అతనికి హర్షద్‌తోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద చదువులు చదివి గొప్ప ప్రయోజకుడు అవుతాడకున్న కుమారుడు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు.





విహారం.. విషాదం



గుర్రంకొండలో కింద పడిన బైక్



అబ్దుల్ అజీజ్(ఫైల్)



హమీద్(ఫైల్)

- నూతన సంవత్సరం వేడుకల కోసం ప్రాజెక్టు వద్దకు..
- తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదం
- కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పిన బైక్
- ఇద్దరు యువకుల మృతి, మరొకరికి గాయాలు

గుర్రంకొండ : విహారం విషాదంగా మారింది. కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి తంబళ్లపల్లె పెద్దేరు ప్రాజెక్టు వద్దకు వెళ్లి నూతన సంవత్సరం వేడుకలను సంతోషంగా జరుపుకొన్నారు. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. రోడ్డుకు అడ్డంగా వస్తున్న కుక్కను ఢీకొని బైక్ కింద పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన పఠాన్ షామీర్ కుమారుడు పఠాన్ హమీద్(29) స్థానిక మార్కెట్‌యార్డులో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హమీద్‌కు సమీప బంధువులైన వైఎస్సార్ జిల్లా కడప పట్టణం ఆర్‌కే నగర్‌కు చెందిన ఎస్.అబ్దుల్ అజీజ్(29), ఎస్.అయూబ్(23) నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకొనేందుకు గుర్రంకొండకు వచ్చారు. హమీద్, అబ్దుల్‌అజీజ్ కుటుంబ సభ్యులు నూతన సంవత్సరాన్ని ఆనందంగా గడపడానికి ఆదివారం తంబళ్లపల్లె పెద్దేరు ప్రాజెక్టు వద్దకు ఆటలో బయలుదేరారు. హమీద్, అబ్దుల్ అజీజ్, అయూబ్ ద్విచక్ర వాహనంలో ఆటోతోపాటు బయలుదేరి వెళ్లారు. అందరూ కలసి పెద్దేరు ప్రాజెక్టు వద్ద రాత్రి వరకు గడిపారు. ఆటోలో వారి కుటుంబ సభ్యులు తిరిగి గుర్రంకొండకు వచ్చేశారు. హమీద్, అబ్దుల్ అజీజ్, అయూబ్ వారితోపాటు రాకుండా ఆలస్యంగా ఇంటికి బయలు దేరారు. మార్గంమధ్యలో గుర్రంకొండకు సమీపంలోని గాజులవారిపల్లె వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం రోడ్డుకు అడ్డంగా వెళుతున్న ఊర కుక్కను ఢీకొని కింద పడింది. ఈ ప్రమాదంలో అబ్దుల్ అజీజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన హమీద్, అయూబ్‌ను 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళ్లాల్సిందిగా ఆస్పత్రి వైద్యులు సూచించారు. తిరుపతికి తీసుకెళుతుండగా మార్గంమధ్యంలో హమీద్ మృతి చెందాడు. గాయాల పాలైన అబూబ్‌ను చికిత్స నిమిత్తం వారి కుటుంబ సభ్యులు కడపకు తరలించారు. హమీద్, అబ్దుల్ అజీజ్ మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

చిరుత సంచరిస్తోందని ఆందోళన



చిరుత దాడిలో మృతి చెందినట్లుగా భావిస్తున్న మేక

ముద్దనూరు : ముద్దనూరు–గండికోట జలాశయం ప్రధాన రహదారిలోని శెట్టివారిపల్లె గ్రామ కొండ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తోందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సోమవారం శెట్టివారిపల్లె గ్రామ శివారులో ఊటుకోన సమీపంలో చిరుతపులి మేకల మందపై దాడి చేసిందని, ఇందులో 5 మేకలు మృతి చెందాయని జీవాల యజమానులు తెలిపారు. తమ మందలో 5 మేకలు లేక పోవడంతో అవి చనిపోయినట్లుగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. చనిపోయిన రెండు మేకలను వారు గుర్తించారు. కొండ ప్రాంతంలో వున్న తమ గ్రామంలో సుమారు 3 నెలల నుంచి భయాందోళనకు గురవుతున్నా అటవీ శాఖ అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

వంగ సాగు.. లాభాలు బాగు

- ఐదు నెలల తరువాత పుంజుకొన్న ధరలు
- మార్కెట్‌లో కిలో రూ.22



రవాణాకు సిద్ధంగా ఉంచిన వంకాయలు

గుర్రంకొండ : జిల్లాలో టమాట, పూలతోటల సాగుతో నష్టపోయిన రైతులను ప్రస్తుతం వంగ సాగు ఆదుకుంటోంది. సుమారు ఐదు నెలల తరువాత మార్కెట్‌లో వంగ ధరలు పుంజుకొన్నాయి. ప్రస్తుతం కిలో రూ.22 వరకు పలుకుతున్నాయి. మన రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. దీంతో జిల్లాలో వంగ సాగు రైతుల కష్టాలు తీర్చి లాభాలు తీసుకొస్తోంది.

జిల్లాలో 3250 హెక్టార్లలో సాగు

జిల్లాలో ఈ సీజన్‌లో 3250 హెక్టార్లలో వంగ తోటల సాగు చేపట్టారు. ఎకరం సాగుకు దుక్కుల దగ్గర నుంచి కాయలు కోతకు వచ్చేంత వరకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు వస్తోంది. మొక్క ఎదుగుదలకు, పూతపిందె నిలవడానికి గానూ వారానికి ఒక సారి మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. మొక్కకు సత్తువ ఇచ్చి కాయలు ఎక్కువ కాయడానికి ఎరువులు, మందుల కోసం ప్రతి వారం సుమారు రూ. 6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన 90 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. సుమారు మూడు నెలల పాటు కాయల కోత ఉంటుంది.

ఎకరానికి రూ.3 లక్షల ఆదాయం

ఈ ఏడాది వంగ తోటల నుంచి మంచి దిగుబడి వస్తోంది. తద్వారా ఎకరానికి గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.20 నుంచి రూ.22 వరకు ధర పలుకుతున్నాయి. అంకూర్ మిగిలిన రకాలు కిలో రూ. 15 నుంచి రూ. 25 వరకు పలుకుతున్నాయి. మార్కెట్లో మొదటి రకం కిలో రూ.22, రెండో రకం కిలో రూ.18, మూడో రకం కిలో రూ.14 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈలెక్కన ఎకరానికి రూ. 2.20 లక్షల నుంచి రూ. 2.64 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అంకూర్ మిగిలిన రకాలైతే రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

సంక్రాంతి సీజన్ ప్రారంభం కావడంతో..

సుమారు ఐదు నెలల తరువాత మార్కెట్లో వంగ ధరలు పుంజుకొన్నాయి. ఐదు నెలల క్రితం ధరలు పతనమవడంతో పలువురు రైతులు తోటలు దున్నేశారు. గతంలో తమిళనాడు రాష్ట్రంలో కురిసిన వర్షాలకు అక్కడి తోటలు భారీగా దెబ్బతిని దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో మన జిల్లా వంగకు అక్కడి మార్కెట్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు నెలల తరబడి ధరలు పుంజుకోక పోవడంతో రైతులు డీలాపడ్డారు. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ ప్రారంభం కావడంతో తమిళనాడుకు ఎక్కువగా మన జిల్లా వంగ ఎగుమతి చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో వంగతోటలు అంతంత మాత్రంగా ఉండడంతో మన జిల్లా వంగ అక్కడికి ఎగుమతి అవుతోంది. ఓవైపు దిగుబడి లేక పోవడంతో మరోవైపు సంక్రాంతి సీజన్ ప్రారంభం కావడంతో వంగ ధరలు ఒక్కసారిగా పుంజుకొన్నాయి.

పందిని తప్పించబోయి..

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం




నరసింహ(ఫైల్)


ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి– బిస్మిల్లాబాదు గ్రామాల మధ్య స్కూటర్‌పై వస్తున్న వీరబోయిన ఉగ్రనరసింహ (27)కు సోమవారం పంది అడ్డు రావడంతో తప్పించబోయి కింద పడి దుర్మరణం చెందాడు. ఎర్రగుంట్ల సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పోట్లదుర్తి గ్రామానికి చెందిన వీరబోయిన శ్రీనివాసులు కుమారుడు వీరబోయిన ఉగ్రనరసింహ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వాడు. ఇంకా వివాహం కాలేదు. ఆదివారం రాత్రి బిస్మిల్లాబాదు నుంచి స్కూటర్‌పై పోట్లదుర్తికి బయలు దేరాడు. ఈ మధ్యలో రోడ్డుకు అడ్డంగా పంది వచ్చింది. దాన్ని తప్పించబోయి కింద పడి గాయాలపాలై మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి అన్న నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భార్యపై భర్త దాడి

నిమ్మనపల్లె : భార్యపై భర్త దాడి చేసిన సంఘటన సోమవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ తన భార్య మాధవి(28)పై కుటుంబ సమస్యల కారణంగా దాడి చేశాడు. మద్యం మత్తులో విచక్షణా రహితంగా కర్రలతో కొట్టాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న బాధితురాలిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య





మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ఎస్‌ఐ రారాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప–కనుమలోపల్లె రైల్వేస్టేషన్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని కుడి చేతిపై కె.పోలయ్య అని ఉంది. అతని వద్ద లింగాలమిట్ట నుంచి భాకరాపేట వరకు తీసుకున్న ఆర్టీసీ బస్సు టిక్కెట్ ఉంది. భాకరాపేట నుంచి కడపకు సోమవారం ఉదయం వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే మంటపంపల్లె–నందలూరు స్టేషన్ల మధ్య ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. ఎవరికైనా తెలిస్తే సెల్ నంబర్: 94409 00811కు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్‌ఐ తెలిపారు.